

# సంసారంలో సరిగమలు - తమస్విని



*(ప్రతి సంసారంలోనూ వినిపించే రాగాలు..*

*కొన్ని సరదాలు, కొన్ని సరాగాలు,*

*కొన్ని సరసాలు, ఇంకొన్ని విరసాలు, మరికొన్ని విషాద గీతాలు..*

*వెరసి సంసారంలో సరిగమలు..!)*

## యాత్ర

**రాజధాని ఎక్స్‌ప్రెస్** హజ్రత్ నిజాముద్దీన్ స్టేషన్‌లో ఆగింది. ఎర్ర చొక్కాల్లోని కూలీలు ఒక్క ఉదుటన లోపలికి ఎక్కి పెద్ద సూట్ కేసులున్న వారిని ‘కూలీ కావాలా?‘ అని అడుగుతున్నారు. కొంతమంది దౌర్జన్యంగా వాటిని సీట్లకింది నించి లాగి కిందకి తీసుకెళ్ళబోతున్నారు. ప్రయాణీకులు కంగారుగా అరుస్తున్నారు.

బంగారయ్య అతికష్టం మీద తన బృందంలోని ఇరవై ఒక్కమందిని వారి సామానుతో సహా రైలు దింపి ప్లాట్‌ఫాం మీద ఓ పక్కకి నించోపెట్టి, అందర్నీ వారి వారి లగేజ్ వచ్చిందో లేదో ఓసారి చూసుకోమని చెప్పాడు.

అంతా లెక్కపెట్టుకుని వచ్చిందన్నట్లుగా తలలూపారు. ఉదయం పదకొండు దాటింది. రామచంద్ర తన స్ట్రోలర్‌ని ఓ పక్కగా పెట్టి గట్టిగా ఊపిరి పీల్చుకున్నాడు.

ఏనాటి ఢిల్లీ? ఉన్నారో లేదో తెలియని కౌరవులు, పాండవుల హస్తినాపురం, బానిస రాజులు, రజియా సుల్తానా, ఘోరీలు, లోడీలు, ఖిల్జీ, తుగ్లక్, తైమూర్, మొఘలాయీలు బాబర్, అక్బర్, జహంగీర్ లాంటి వారు పరిపాలించిన దిల్లీ. బ్రిటిషర్స్, నెహ్రూ ఎంతోమంది పాలనతో ఎంతో ప్రాభవాన్ని పొందిన ఇంద్రప్రస్థం! మీర్జా గాలిబ్, నిజాముద్దీన్‌లాంటి ప్రముఖులు గాలిపీల్చిన నేలమీద తనూ నించోగలగడం ఎంత అదృష్టం!‘ అనుకున్నాడు. క్రమంగా ప్లాట్‌ఫాం మీద సందడి తగ్గింది. బంగారయ్య కంగారుగా పచార్లు చేస్తూ సెల్‌ఫోన్‌లో రీడయిల్ నొక్కుతున్నాడు. రైలు చిన్న కుదుపుతో వెళ్ళిపోయింది. కొంత మంది కూలీలు ఆ చుట్టుపక్కల కొద్దిసేపు తచ్చట్లాడి, వీళ్ళు కదిలేట్లు లేదని మరీ రైలు దగ్గరకి వెళ్ళిపోయాడు.

ఆడవాళ్ళు బెంచ్‌ల మీద కూర్చుని గుసగుసగా మాట్లాడుకుంటున్నారు. మగవాళ్ళు ఏమైందన్నట్లుగా బంగారయ్య వైపు ప్రశ్నార్థకంగా చూస్తున్నారు. "ఏమైందో ఏమిటో బావా! ఈ దొంగనాకొడుకు ఫోనెత్తడం లేదు. ఇప్పుడీ గుంపుతో ఏం చెయ్యాలి?" రామచంద్ర దగ్గరకి వచ్చిన బంగారయ్యలో గొంతుకతో అడిగాడు.

"మనకి ఏ హోటల్ బుక్ చేసానన్నాడు? పోనీ అక్కడికి వెళ్ళిపోదాం." రామచంద్ర చెప్పాడు.

"ఈ ఢిల్లీనిండా మోసగాళ్ళే బావా. ఇంతమందిని తీసుకెళ్ళడానికి వేన్లు మాట్లాడటం కష్టం. వాళ్ళు తప్పుదారిలో తీసుకుపోకుండా మన హోటల్ ముందు దింపుతారని నమ్మలేం. ఈ ఆడోళ్ళని బంగారం వేసుకురావద్దమ్మా అంటే విన్నారా? 'పుస్తెల తాడు లేకపోతే ఎట్టా?' అని చేంతాడంత గొలుసులు దిగేసుకు వచ్చారు. నాకు కాళ్ళూ చేతులు ఆడడంలేదు. ఈ ఎదవనాకొడుకుని నమ్మి ఇరుక్కుపోయా" బంగారయ్య నిస్సహాయంగా చెప్పాడు.

"ఢిల్లీలో ట్రాఫిక్ జామ్స్ ఎక్కువట. ఇంకో అరగంట చూద్దాం" చేతి గడియారం చూసుకుంటూ చెప్పాడు రామచంద్ర.

గుంటూరికి ఇరవై కిలోమీటర్ల దూరంలో ఉన్న ఆ పల్లెటూరు ఆధునికతకి ఇప్పుడిప్పుడే అలవాటు పడుతోంది. వ్యవసాయధారిత గ్రామం కావడంతో ఏభై దాటిన వాళ్ళతో టెన్త్ క్లాస్ దాటిన వాళ్ళు తక్కువ. చిన్న ఊరు అవడంతో వాళ్ళలో ఐకమత్యం ఎక్కువ. తామెటూ చదువుకోలేదని పిల్లల్ని బాగా చదివించారు. ఎక్కువమంది మగపిల్లలు డిగ్రీలు చదివి వ్యవసాయంలో ప్రవేశిస్తే, ఆడపిల్లలకి డాక్టర్, ఇంజనీర్ సంబంధాలు చేసి విదేశాలకి పంపించారు.

అలా కూతుర్ని ఢిల్లీలో ఇంజనీర్గా పనిచేస్తే ఐఐటియన్కిచ్చి పెళ్ళి చేసిన బంగారయ్య రెండేళ్ళ క్రితం ఢిల్లీ వచ్చాడు. ఆ సమయంలో కూతురు, అల్లుడు ఆస్ట్రేలియాకి వెళ్ళే హడావిడిలో ఉన్నారు. కూతుర్ని మళ్ళీ ఎప్పుడు చూస్తానో అని బంగారయ్య సతీసమేతంగా ఢిల్లీకి వచ్చాడు కానీ వాళ్ళు బిజీగా ఉండటంతో నాలుగోరోజు నించి తోచక, 'రిటన్ టిక్కెట్ని ముందుకి మార్చుకోవచ్చా?' అని అల్లుడ్ని అడిగాడు.

అత్తమామల ఇబ్బందిని గమనించిన అల్లుడు, ఓ లోకల్ టూరిజం ఆఫీస్ని కాంటాక్ట్ చేసి, తెలుగు మాట్లాడే గైడ్ని పంపమని కోరాడు. వాళ్ళు పంపిన గైడ్తో తన కారులో వాళ్ళని ఢిల్లీ చుట్టుపక్కల చూసి రమ్మని పంపించాడు. ఆ విధంగా ఢిల్లీ, ఆగ్రా, మధుర, హరిద్వార్, రిషికేశ్లాంటివి చూసిన బంగారయ్య దంపతులు తమ ప్రయాణానికి రెండు రోజులముందు మళ్ళీ కూతురింటికి చేరుకున్నారు. ఈ వారంలో గైడ్ స్వామి వాళ్ళకి బాగా ఆత్మీయుడై పోయాడు. సహనంగా అన్ని యాత్రా స్థలాలని చూపించి, వాటి విశిష్టతలని చక్కగా వివరించి, వాళ్ళు ఏ మాత్రం కష్టపడకుండా సౌతిండియన్ హోటళ్ళకి తీసుకెళ్ళి, వాళ్ళకి నచ్చిన వస్తువులని హిందీలో బేరమాడి కొనిపెట్టి వాళ్ళ మెప్పుని పొందాడు. అతనికి ప్రత్యేకంగా టిప్ ఇచ్చిన బంగారయ్య అతని ఫోన్ నంబర్ని, విజిటింగ్ కార్డ్ని కూడా తీసుకున్నాడు. తమ ఊరికి వచ్చాక నలుగురితో మాట్లాడినప్పుడు ఏదో ప్రసక్తిలో హరిద్వార్లో గంగ చల్లగా ఉంటుందని, దారిలో రాజీవ్ గాంధీ చదువుకున్న స్కూల్ చూసానని, తాజ్మహల్లో పాలరాతిలో చెక్కడాలు విడ్డూరంగా ఉన్నాయని, శ్రీకృష్ణుడు పుట్టిన జైలుగదిని చూసానని చెప్పడంతో తోటి గ్రామస్థుల్లో ఢిల్లీ వెళ్ళి చూడాలనే కోరిక పెరగసాగింది.

"మమ్మల్ని కూడా తీసుకెళ్ళి ఆ వింతలు, విడ్డూరాలు చూపించచ్చుగా?" ఓ గ్రామస్థుడు అడిగాడు.

"మా అమ్మాయివాళ్ళుంటే బావుండేది. వాళ్ళు ఆస్ట్రేలియా వెళ్ళిపోతిరి. మిమ్మల్నందర్నీ తీసుకెళ్ళి ఎక్కడ పెట్టను?" బంగారయ్య తిరస్కరించాడు. ఆరునెలలక్రితం, అరుదుగా వేసుకునే చొక్కా దులిపినప్పుడు స్వామి విజిటింగ్ కార్డ్ బయటపడింది. అది చూడగానే, గైడ్ స్వామి సహాయంతో గ్రామస్థుల్ని ఢిల్లీ తీసుకెళ్ళి తను చూసినవన్నీ చూపించి రావచ్చు అనిపించి, ముందుగా అతనికే ఫోన్ చేసాడు.

వెంటనే గుర్తుపట్టిన స్వామి, తప్పకుండా సహాయం చేస్తానని, ఎంతమంది వస్తారో ముందుగా చెపితే హోటల్, మినీబస్ రిజర్వేషన్స్ లాంటివన్నీ ఏర్పాటు చేస్తానన్నాడు. మనిషికి కనీసం ఎంతవుతుందో లెక్కలేసి చెప్పి, దానికి ఐదువేలు అటూ ఇటూ అవచ్చని చెప్పాడు.

ఆ మర్నాడు బజార్లో అరుగులమీద కూర్చున్న వాళ్ళతో బంగారయ్య ఈ విషయాలు చర్చించాడు. చాలామంది ఆసక్తి చూపించారు. కొంతమంది భార్యా సమేతంగా వస్తామన్నారు కానీ బంగారయ్య భార్య మాత్రం మోకాళ్ళ నొప్పులు నేను రాలేనని చెప్పింది. ఇరవైమంది గట్టిగా వస్తామన్నారు.

ఓ సాయంత్రం బంగారయ్య, రామచంద్ర ఇంటికి వెళ్ళాడు. గుంటూరు గవర్నమెంట్ కాలేజ్‌లో లెక్చరర్‌గా పనిచేసే ఏభైయేళ్ళ రామచంద్ర ఆ ఊళ్ళో చదువుకున్నవాళ్ళలో ఒకడు. స్వంత ఇల్లు, భూమి ఉండటంతో గుంటూరులో కాపురం పెట్టకుండా రోజూ బైక్ మీద వెళ్ళి వస్తూంటాడు. అతనికి తమ ఢిల్లీ యాత్ర గురించి వివరించిన బంగారయ్య కోరాడు.

"చెల్లాయ్ ఎటూ అమెరికాలో ఉందిగా, నువ్వొరా బావా అవసరమైతే ఇంగ్లీష్ మాట్లాడ్తావు. మాకెవరికీ ఓ అంటే నా రాదు."

రోజూ రానూ, పోనూ నలభై కిలోమీటర్లు ప్రయాణించే రామచంద్రకి ప్రయాణాలంటే అయిష్టం. అదే చెప్పాడు.

"ఎగ్జామ్స్ బావా సెలవు ఇవ్వరు. మీరు వెళ్ళిరండి."

"ఐతే నీకు సెలవులు ఇచ్చినప్పుడే వెళ్దాం నువ్వు వస్తున్నావు. ఫైనల్." బంగారయ్య ఒప్పించాడు.

దాంతో ప్రయాణం రామచంద్రకి సెలవులిచ్చాక సాధ్యపడింది. స్వామి వాళ్ళకి హోటల్ రూమ్స్ బుక్ చేసానని, వేన్ కూడా మాట్లాడానని చెప్పాడు. అంతా ఉత్సాహంగా విజయవాడలో రాజధాని ఎక్స్‌ప్రెస్ ఎక్కి, వాళ్ళు కలలోకూడా ఊహించని ఢిల్లీలో దిగారు. కానీ స్వామి ఏమయ్యాడో తెలీదు. ఫోన్ ఎత్తడం లేదు. రామచంద్ర అతని విజిటింగ్ కార్డులో వాళ్ళ టూరిస్ట్ కంపెనీ పేరు చూసి, వాళ్ళతో ఇంగ్లీష్‌లో మాట్లాడి స్వామి గురించి అడిగాడు. తెలియదని, పదిరోజులు సెలవు పెట్టాడని చెప్పారు. అతని దగ్గర మరో నెంబర్ లేదనికూడా చెప్పారు.

బంగారయ్య బి.పి పెరిగిపోతోంది. భోజనం టైమ్ అవడంతో అంతా టీలు తాగారు. సహించినవాళ్ళు పూరీలు, చపాతీలు తిన్నారు. పన్నెండున్నర దాటుతూండగా స్వామి హడావిడిగా వచ్చాడు.

"సారీ అండీ. కొంచెం ఆలస్యమైంది"

"కొద్దిగానా? పదిన్నరకి దిగాం. ఇప్పుడు పన్నెండున్నర. రెండుగంటలనించి ఈ ఫ్లాట్‌ఫాం మీద పడి ఏడుస్తున్నాం" బంగారయ్య కోపంగా చెప్పాడు.

స్వామి మౌనంగా ఆయన సూట్‌కేస్‌ని అందుకుని బయటకి నడిచాడు. అంతా తమ తమ సామానులతో వెనకే నడిచారు. స్టేషన్ బయట ఆగివున్న ఓ మినీబస్ దగ్గరకు తీసుకెళ్ళి వారితో చెప్పాడు.

"లగేజ్ ఇక్కడ పెట్టి బస్‌లో కూర్చోండి. డ్రైవర్ వాటిని లోపల పెడతాడు."

కానీ మగవాళ్ళు ఎవరూ కదల్లేదు. ఆడవాళ్ళు బస్సెక్కి ఒకరివెనక ఒకరు కిటికీ పక్కన కూర్చుని బయటకి చూడసాగారు. మగవాళ్ళు వాళ్ళ లగేజ్‌ని లోపలపెట్టడం చూసాక వచ్చి బస్సెక్కసాగారు. అంతా ఎక్కాక బస్ కదిలింది.

ముందువరసలో కూర్చున్న రామచంద్ర గైడ్ స్వామి వంక చూసాడు. ముప్పై ఐదేళ్ళు ఉండచ్చు. నలిగిన దుస్తులు, మాసినగడ్డం. స్నానం చేసినట్లు లేడు. భుజానికి ఖాదీ సంచి వేలాడుతోంది. కళ్ళు ఎర్రగా ఉన్నాయి. అతను గైడ్‌లా లేడు. విలేకరిలా ఉన్నాడు.

"రాత్రంతా తాగి వుంటాడు. అందుకే లేవడం లేటై వుంటుంది" అతని వెనక సీట్లో కూర్చున్న దంపతులు గుసగుసలాడుకుంటున్నారు.

"అంతా వచ్చారా సార్?" స్వామి వినయంగా అడిగాడు.

"అది నీ పని. మొత్తం ఇరవై ఒక్క మందిమి. ఇకనించి నువ్వే లెక్కపెట్టుకో. నీ మీద నమ్మకంతో నేను ఇంతమందిని తీసుకొస్తే నువ్వు నాకు అవమానం చేసావు. ఒక ఊరు రాజు ఇంకో ఊరికి వెట్టి అన్నట్లు అయింది నా పని." ఆయన కస్సుమన్నాడు.

స్వామి తలవంచుకున్నాడు తప్ప ఆలస్యమెందుకైందో చెప్పనేలేదు. అతని మొహం ఎర్రబడింది. కళ్ళలో నీరు చెమర్చుతోందని రామచంద్ర గ్రహించాడు. స్వామి మైక్ తీసుకుని చెప్పాడు.

"వెల్ కం టు న్యూ ఢిల్లీ. మనం ఇప్పుడు సరాసరి మీ హోటల్‌కి వెళ్తున్నాం. ఇవాళా రేపు అందులోనే మీ బస. ఎల్లుండి మనం ఆగ్రాకి బయలుదేరతాం" అతను జేబులోని కర్చీఫ్ తీసుకుని మొహం తుడుచుకున్నాడు. బస్ మెయిన్ రోడ్ మీదకి వచ్చింది. హైదరాబాద్ తప్ప మరో పెద్ద ఊరు చూడని గ్రామస్థులు కళ్ళు విప్పార్చి కిటికీలోంచి సుందర ఢిల్లీ నగరాన్ని చూస్తున్నారు.

"స్నానాలయ్యాక ఇవాళ ఎక్కడి తీసుకెళ్తున్నావ్?" బంగారయ్య అడిగాడు.

స్వామి ఇబ్బందిగా చూసాడు.

"జర్నీ చేసి వచ్చారు. ఈ రోజు రెస్ట్ తీసుకోండి. రేపటినించి సైట్ సీయింగ్‌కి వెళ్దాం" చెప్పాడు.

"అంత దూరం నించి వచ్చింది హోటల్ రూంలో దొర్లడానికా? గంటలో మేం రెడీ అవుతాం. అన్నాలు తిని ఊరు చూడ్డానికి వెళ్దాం" బంగారయ్య కఠినంగా చెప్పాడు.

స్వామి నిస్సహాయంగా చూసాడు కానీ ఏమీ మాట్లాడలేదు.

అతనికేదో ఇబ్బంది వచ్చిందని రామచంద్ర ఊహించాడు. బహుశా తల్లో, తండ్రో హాస్పిటల్లో ఉన్నారేమో అనుకున్నాడు.

"ఇదిగో స్వామీ ఆ కనిపించే ఎర్ర రంగుది ఏంటి? ఎర్రకోటా?" ఒకావిడ అడిగింది.

అంతా అటువైపు చూసారు. స్వామి వంగి చూసి చెప్పాడు.

"కాదండి. జంతర్ మంతర్"

"నువ్వేం గైడ్‌వయ్యా? మొదటిసారి వచ్చినవాళ్ళకి దారికి అటూ ఇటూ ఏవున్నాయో చెప్పక్కర్లా?" ఒకాయన అరిచాడు.

స్వామి మళ్ళీ కర్చీఫ్ తీసుకుని ముఖం తుడుచుకున్నాడు. ఏసి బస్‌లో అతనికి ఎందుకు చెమట పోస్తుందో రామచంద్రకి అర్థంకాలేదు.

హోటల్ మయూరి ఆవరణలో బస్సాగింది. అంతా బిలబిల్లాడుతూ బస్ దిగి లోపలికి వెళ్ళి రిసెప్షన్‌లో ఉన్న కుర్చీల్లో కూర్చున్నారు. డ్రైవర్ లగేజ్ తెచ్చి లోపల పెట్టాడు. రామచంద్ర చుట్టూ చూసాడు. స్వామి ఓ మూలకి వెళ్ళి ఫోన్‌లో మాట్లాడుతున్నాడు.

"ఏవయ్యా స్వామీ. మాకు గది తాళం చెవులు ఇచ్చేది ఉందా లేదా? మమ్మల్నిక్కడ కూర్చోపెట్టి నీ పాటికి నువ్వు ఫోన్‌లో ముచ్చట్లేంటి?" బంగారయ్య కయ్యిమన్నాడు.

స్వామి ఫోన్ పెట్టేసి రిసెప్షన్ దగ్గరకి వెళ్ళి గదుల తాళం చెవులు తెచ్చి పేర్ల ప్రకారం అందరికీ ఇచ్చాడు.

"రెండున్నరకల్లా తయారై కిందకి రండి. లంచ్‌కి వెళ్దాం. నేనిక్కడే లాబీలో ఉంటాను" చెప్పాడు.

గది బానే వుంది. రామచంద్ర అరగంటలో తయారై కిందకి వచ్చారు.

స్వామి లాబీలో ఓ మూల కూర్చుని ఫోన్ చూసుకుంటున్నాడు. అతని పక్కకి వెళ్ళి కూర్చుని అడిగాడు.

"అమ్మా నాన్నా ఎక్కడుంటారు?"

అతను ఉలిక్కిపడి తలెత్తి చూసి చెప్పాడు.

"చిత్తూరులో ఉంటారండి. ఇద్దరూ టీచర్లు. అందుకని ఊరు వదిలి రారు"

అంటే ఇతనికి హాస్పిటల్‌లో సీరియస్‌గా ఉన్న పేరెంట్స్ లేరు. మరి ఆ కంగారు ఎందుకనో? వృత్తిపరమైన గొడవలు అనుకున్నాడు.

ఆ తర్వాత వారం స్వామి పరధ్యానం, బంగారయ్య తిట్లు వాళ్ళకి అలవాటైపోయాయి. స్వామినారాయణ్ టెంపుల్‌లో ఎక్కువ దూరం నడిపించాడని, ఎర్రకోట షాపింగ్‌లో సరిగ్గా బేరమాడలేదని, రాష్ట్రపతి భవన్ చూడడానికి పర్మిషన్ తీసుకోలేకపోయాడని, రెండేళ్ళనాడు ఉత్సాహంగా ఉన్నవాడు ఇప్పుడు మన్ను తిన్నపాములా అయిపోయాడని...

స్వామి సహనంగా ఆ తిట్లు భరించాడు. రామచంద్రకి అతనిమీద జాలికూడా కలిగింది. మీ డబ్బు మీరు తీసుకుపొమ్మని ఓ నమస్కారం పెట్టచ్చు. బేరాలు నా బాధ్యతకాదని వాదించచ్చు. నోరు పారేసుకోవద్దని హెచ్చరించవచ్చు. అవేమీ చేయకుండా అతను మౌనంగా ఉండిపోవడం బాధనిపించింది.

"బావా! అతన్ని మరో హింసిస్తున్నావేమో! వాడు తెల్లారేసరికి కనపడకుండా పారిపోతే ఊరుగాని ఊళ్ళో ఏం చేస్తాం చెప్పు" బంగారయ్యని శాంతపరిచే ప్రయత్నం చేసాడు.

"కిందటిసారి ఇట్లా లేడు బావా. ఈడ్ని నమ్మి ఇంతమందిని ఏసుకొస్తే వీడు ఈ తీరుగా ఉన్నాడు. నాకెంత అవమానం చెప్పు?" బంగారయ్య ఎర్రబడ్డ మొహంతో అడిగాడు.

ఫతేపూర్ సిక్రీకోట చూసి బయటకి వచ్చాక రామచంద్ర అడిగాడు.

"అక్బర్ సమాధి ఇక్కడెక్కడో ఉంటుందని విన్నాను?"

"అవునండి. ఈ పక్కనే" స్వామి చెప్పాడు.

"మరి వెళ్దామా?"

అప్పటికే కోట చూడ్డానికి అనేక మెట్లు ఎక్కి దిగిన వాళ్ళు ఆసక్తి చూపించలేదు.

"సమాధి చూడడానికి అదేమైనా తాజ్‌మహలా? ఇక్కడ కూర్చుంటాంలే నువ్వెళ్ళిరా" బంగారయ్య చెప్పాడు.

రామచంద్ర, స్వామి అక్బర్ సమాధి దగ్గరకి వెళ్ళారు. కోటకి దగ్గర్లో ఓ సాధారణ సమాధి. అక్కడంతా చీకటి. ఓ చిన్న నూనె దీపం మిణుకు మిణుకుమంటోంది. పక్కనే కోటలో వైభవం, దేదీప్యమానమైన దీపాలు. అందులో ఒకప్పుడు రాజ్యమేలిన రాజు చీకట్లో విశ్రాంతి తీసుకుంటున్నాడు.

"ఇలాంటివి చూస్తే వైరా గ్యం వస్తుంది. ఎంత బాగా బతికినా చివరికి మనకంటూ ఎవరూ మిగలరు. అక్బర్‌కి అనేకమంది లీగల్ భార్యలు, ఉంపుడుగత్తెలు, వాళ్ళద్వారా సంతానం, చక్రవర్తి పదవి అన్నీ ఉన్నాయి. కానీ ఇప్పుడు చూడు. ఏ ప్రేమైనా ఈ దీపం పెట్టిందా? ఓ ఉద్యోగి విసుక్కుంటూ పెట్టివుంటాడు" రామచంద్ర ఉద్వేగంగా చెప్పాడు.

స్వామి ఉన్నట్లుండి మోకాళ్ళ మీద కూలిపోయి ఏడవసాగాడు. ఆ చీకట్లో ఆ రోదన హృదయవిదారకంగా ఉంది. వారం రోజులుగా అతనిలో అణచిపెట్టుకున్న దుఃఖం ఈ విధంగా కరిగి నీరై ప్రవహిస్తోందనుకున్నాడు రామచంద్ర.

ఐదునిమిషాలకి తెప్పరిల్లిన స్వామి లేచి తడికళ్ళతో చెప్పాడు.

"సారీ సర్. వెళ్దాం పదండి."

"వెళ్దాంలే. ఇంతకీ నువ్వెందుకు ఇంత బాధ పడుతున్నావో చెప్తావా? మా బంగారయ్య బావ చెప్పిన ప్రకారం ఇది నీ కేరక్టర్ కాదు" రామచంద్రయ్య అనునయంగా అడిగాడు.

"ఆరోజు... మీరు రైలు దిగినరోజే భార్గవి నన్ను వదిలేసి వెళ్ళిపోయింది" స్వామి దుఃఖంగా చెప్పాడు.

"భార్గవి ఎవరో నాకు అర్థంకాలేదు. వివరంగా చెప్పు."

"భార్గవి నా వైఫ్ సర్. ఇక్కడే ఢిల్లీలో పరిచయం. నేను ఇంగ్లీష్‌లో మాట్లాడే గైడ్‌ని. తను స్పానిష్ నేర్చుకుంది. స్పానిష్ టూరిస్ట్‌లని బెట్టీ అనే క్రిస్టియన్ పేరుతో గైడ్ చేస్తుంది. తను యుపి అమ్మాయి. ఈ పెళ్ళి ఇష్టంలేక మా అమ్మా నాన్న తెగతెంపులు

చేసుకున్నారు. కానీ మేమిద్దరం ఎంతో ప్రేమగా ఉండేవాళ్ళం సార్. మాకు డాలర్స్‌లో టిప్స్ వచ్చేవి. సంవత్సరంలో తొమ్మిదినెలలు పని వుండేది. మిగిలిన మూడునెలలు మేము ఇండియా, ఎబ్రాడ్‌లని టూరిస్ట్‌లుగా వెళ్ళి చూసేవాళ్ళం. మాకు టూరిజం అంటే చాలా ఇష్టం. అంతా హేపీగా సాగుతుంటే...." స్వామి దుఃఖంగా ఆపేసాడు.

రామచంద్ర సహనంగా వేచివున్నాడు.

"మీరు వచ్చే ఆ రోజు పొద్దునే లేచి చూస్తే ఇంట్లో భార్గవి లేదు. వాట్సప్‌లో వాయిస్ మెసేజ్ పెట్టింది. వింటారా?" జేబులోంచి ఫోన్ తీయబోయాడు.

"పర్లేదు. సారాంశం ఏంటో చెప్పు చాలు" రామచంద్ర వారించాడు.

"భార్గవి ఒక స్పానిష్ గ్రూప్‌తో పదిహేనురోజులు ఇండియా టూర్‌కి వెళ్ళి రెండురోజుల క్రితమే వచ్చింది. ఆ గ్రూప్‌లోని ఒకరితో ప్రేమలో పడ్డానని, అతనితో స్పెయిన్ వెళ్ళిపోతున్నానని చెప్పింది. తను ఇక తిరిగిరాదు కాబట్టి నేను ఇంకో పెళ్ళి చేసుకోవచ్చు. కొన్ని తెల్లకాగితాల మీద సంతకాలు పెట్టి వెళ్తున్నానని చెప్పింది. మాకు పదేళ్ళు షెంజన్ వీసా ఉండటంతో చిత్తూరు వెళ్ళినట్లే వెళ్ళిపోయింది..."

స్వామి కళ్ళు తుడుచుకుని మళ్ళీ చెప్పాడు.

"ప్రేమికులు విడిపోతే పడే బాధని దేవదాసులాంటి సినిమాల్లో చూసాం సార్. కానీ పెళ్ళాం వదిలి పెట్టివెళ్ళిపోతే అబ్బ! ఎంత బాధనుకున్నారు?"

గుండెలమీద రాసుకున్నాడు.

"ఆ మెసేజ్ వినగానే నాకు ఓ క్షణం ఏమీ అర్థంకాలేదు. తర్వాత వెంటనే ఏర్‌పోర్ట్‌కి వెళ్ళాను. కానీ తను కనిపించలేదు. శాశ్వతంగా వెళ్ళిపోయింది. ఆ ఆలోచన ఎంత బాధాకరం అంటే పదింటిదాకా పిచ్చివాడిలా అక్కడే తిరిగాను. సినిమాల్లోలాగా తను మనసు మార్చుకుని వెనక్కి తిరిగి వస్తుందేమో అని. పదిన్నరకి మీ రైలు వస్తుందని గుర్తొచ్చింది. మా ఏజెన్సీతో సంబంధం లేకుండా నేను కుదుర్చుకున్న డీల్ ఇది. దాంతో అక్కడినించి స్టేషన్‌కి వచ్చేసరికి ఆలస్యమైంది. ఈ వారం రోజులనించి నిజానికి నా వృత్తికి నేను ద్రోహం చేస్తున్నాను. నాకు అర్థమౌతోంది. కానీ నావల్ల కావడంలేదు. భార్గవి నించి మెసేజ్ వస్తుందేమో, ఫోన్ వస్తుందేమో అని నిమిష నిమిషానికి ఫోన్ చూసుకోవాలనిపిస్తోంది. కానీ ఫ్రెండ్స్ నించి వచ్చే ఫోన్స్ అన్నీ. అదీ 'నీ పెళ్ళాం లేచిపోయిందిట కదా?' అనే మాటకి కొంచెం సంస్కారపు పూతపూసి అడగడానికే. రెండు విధాలుగా టార్చర్ అనుభవిస్తున్నానండీ. భార్గవి నన్ను వదిలి వెళ్ళిపోయిందని, రేపటినించి అంతా నా వెనక 'వీడి పెళ్ళాం వీడ్ని వదిలేసి లేచిపోయింది. చవట దద్దమ్మ' అని నవ్వుతారని. ఈ పరిస్థితిలో నేను మీకు తాజ్‌మహల్ అందాలు, కుతుబ్ మినార్ చరిత్ర, రోషనారా గది, హరిద్వార్ పవిత్రత ఇవన్నీ ఎలా వివరించగలను సర్? అందుకే బంగారయ్యగారి తిట్లన్నీ దీవెనలుగా తీసుకుంటున్నాను. పదండి సార్. లేటైంది."

స్వామి ముందుకు దారి తీసాడు. రామచంద్ర మౌనంగా అనుసరించాడు.

***(వచ్చే సంచికలో మరో సరిగమ)***

Click here to share your comments